

చీనీ టన్ను రూ.29,190

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.29,190, కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.18,600 ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి ధర రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.7°/ 11.2°

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ అధికారులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లోకేష్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ చేతుల మీదుగా కళాశాలలో విడుదల చేశారు. మూడో సెమిస్టర్ ఫలితాల్లో బీఏలో 71 శాతం, బీకాంలో 62 శాతం, బీఎస్సీలో 68 శాతం, బీబీఏలో 83 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఐదో సెమిస్టర్‌లో బీఏలో 88 శాతం, బీకాంలో 81 శాతం, బీఎస్సీలో 80 శాతం, బీబీఏలో 92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రామకృష్ణ, పరీక్షల విభాగం అధికారులు చలపతి, శ్రీనివాసులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు

- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: అర్హులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచపట్టి రూ.15 వేలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాల పరిశీలన అంశంపై చర్చించేందుకు శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదరం శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్న వారిలో అర్హులుగా తేలిన వారందరికీ వెంటనే సర్టిఫికెట్లు అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్ల పరిశీలన కోసం జిల్లా స్థాయిలో స్పెషలిస్ట్ వైద్యులతో బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారానికి మూడు రోజులు బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో ధ్రువీకరణ పత్రాలను పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల డీసీఓగా జయలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల (అంబేడ్కర్ గురుకులాలు) ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ)గా కె.జయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. నెల్లూరులో ఇన్‌చార్జ్ డీసీఓగా పని చేస్తున్న కె.జయలక్ష్మికి రెగ్యులర్ పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు.

జలం.. గరళం!



గుడిబండకు చెందిన శ్రీరాములు వెన్నెముక సమస్యతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న నీరు తాగడం వల్ల సమస్య తలెత్తినట్లు వెల్లడించారు.

గాండ్లపెంటకు చెందిన నారాయణప్ప కీళ్ల నొప్పులతో కదిరి ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షలు చేసిన వైద్యులు రసాయనాలు ఎక్కువగా కలిసిన నీటిని తాగడం వల్లే ఎముకలు అరిగిపోయినట్లు తెలిపారు.

...ఇలా జిల్లా వ్యాప్తంగా చాలా మంది మోకాళ్ల నొప్పులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. పరిమితికి మించి భూగర్భజలాలను తోడేస్తుండటంతో తాగునీరులో ఫ్లోరైడ్, నైట్రేట్, ఆర్సెనిక్ తదితర రసాయనాల శాతం పెరుగుతోంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్‌లో శుద్ధి చేసిన జలంలోనూ రసాయనాల శాతం ఎక్కువగా కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.

- జిల్లాను పీడిస్తున్న 'ఫ్లోరైడ్ బూతం
- తాగునీటిలో మోతాదుకు మించి రసాయన అవశేషాలు
- రోగాల బారిన పడుతున్న జనం
- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న బాధితులు

సాక్షి, పుట్టపర్తి

జిల్లాలో పలు చోట్ల భూగర్భ జలాలు ప్రమాదకరంగా మారాయి. రసాయనాలు కలవడంతో తాగే జలం కూడా గరళంగా మారింది. భూగర్భ జల నాణ్యత నివేదికలో ఇది తేటతెల్లమైంది. 2023లో నైరుతి రుతుపవనాలు రాక ముందు.. వర్షాలు కురిసిన తదనంతరం దేశవ్యాప్తంగా రెండుసార్లు భూగర్భ జలాలను కేంద్ర భూగర్భ జల మండలి సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించింది. ఆ పరీక్షల్లో వెల్లడైన అంశాలతో 'వార్షిక భూగర్భ జలాల నాణ్యత నివేదిక - 2024'ను విడుదల చేసింది. ఆ నీటిలోని రసాయన అవశేషాలు, వాటి కారణంగా ఎదురయ్యే సమస్యలను వివరించింది.

ఫ్లోరైడ్ జిల్లాల జాబితాలో శ్రీసత్యసాయి..

భూగర్భ జల నాణ్యత నివేదికలో జిల్లాలో పలు చోట్ల ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్‌తో పాటు ఆర్సెనిక్ అనే రసాయన అవశేషాలు ఉన్నట్లు తేలింది. దేశంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న తొలి 15 జిల్లాల్లో శ్రీసత్యసాయి 10వ స్థానంలో ఉంది. జిల్లాలో సగటున 31.76 శాతంగా ఫ్లోరైడ్ ఉన్నట్లు నివేదికలో వెల్లడించారు. నమూనాల్లో లీటరు నీటికి 1.5 ఎంజీ మించి ఫ్లోరైడ్ కనిపించినట్లు పేర్కొన్నారు.

2 ఎంజీ
గాండ్లపెంట మండలం గాజువారిపల్లిలో నమోదైన ఫ్లోరైడ్ శాతం

60.4 ఎంజీ
గుడిబండ మండలం కుమ్మరనాగేపల్లిలో నమోదై నైట్రేట్ శాతం

228
ప్రభుత్వం ద్వారా దయాలసిస్ పింఛన్ పొందుతున్న వారి సంఖ్య



పరిమితికి మించి ఫ్లోరైడ్..

జిల్లాలోని భూగర్భ జలాల్లో పరిమితికి మించి ఫ్లోరైడ్ ఉన్నట్లు కేంద్ర భూగర్భ జల మండలి నివేదికలో వెల్లడైంది. సాధారణంగా లీటరు నీటిలో 1.5 ఎంజీలోపే ఫ్లోరైడ్ ఉండాలి. కానీ పలు ప్రాంతాల్లో 2 ఎంజీ కి మించి.. ఇంకొన్ని చోట్ల గరిష్టంగా 5 ఎంజీ మించి ఫ్లోరైడ్ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. ఆ నీటిని తాగితే ఫ్లోరోసిస్, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 98 పిజోమీటర్ల ద్వారా భూగర్భ జలాలు సేకరించి ఫ్లోరైడ్ పరీక్షలు నిర్వహించగా.. 72 చోట్ల ఫ్లోరైడ్ పరిమితికి మించి ఉన్నట్లు తేలింది. ఫలితంగా తాగునీటి విషయంలో అందరూ ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాల్సిన పరిస్థితి నెలకొంది.

అత్యధిక నైట్రేట్‌తో ఆరోగ్య సమస్యలు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లోని జలాల్లో నైట్రేట్ ఎక్కువగా ఉన్నట్లు తేలింది. సాధారణంగా లీటరు నీటిలో 45 ఎంజీ కంటే ఎక్కువ నైట్రేట్ ఉండకూడదు. కానీ పలు చోట్ల మోతాదుకు మించి 60 ఎంజీ వరకు నైట్రేట్ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. నైట్రేట్ అధికంగా ఉన్న నీటిని తాగితే మహిళలకు తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గర్భస్థ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, పురుషులు అల్సర్ బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆర్సెనిక్‌తోనూ సమస్యలే..

లీటరు నీటిలో ఆర్సెనిక్ అనే రసాయనం 0.01 ఎంజీ వరకూ ఉండవచ్చు. అయితే జిల్లాలో చాలా చోట్ల సాధారణం కంటే అధికంగా ఉంది. గరిష్టంగా కొన్ని ప్రాంతాల్లో 19 ఎంజీగా కూడా ఉన్నట్లు తేలింది. ఆర్సెనిక్ అధికంగా ఉన్న నీటిని తాగడం వల్ల ఆర్సెనికోసిస్ అనే వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదేవిధంగా లంగ్ క్యాన్సర్, డయాబెటీస్, గుండె, రక్తనాళాలు దెబ్బతినడం, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధిక ఐరన్‌తోనూ ముప్పే..

లీటరు నీటిలో 1 ఎంజీ మాత్రమే ఐరన్ ఉండాలి. అయితే జిల్లాలో చాలా చోట్ల 2 ఎంజీ వరకు ఐరన్ ఉన్నట్లు కేంద్ర భూగర్భ జల మండలి నివేదికలో తేలింది. తాగునీటిలో ఐరన్ సాధారణం కంటే ఎక్కువగా ఉంటే తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ఐరన్ అధికంగా ఉండే నీటిని తాగితే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

పల్లెల్లో ఫ్లోరైడ్ భూతం..



జిల్లాలోని చాలా గ్రామాలను ఫ్లోరైడ్ భూతం పట్టిపీడిస్తోంది. కదిరి రెవెన్యూ డివిజన్‌తో పాటు మడకశిర నియోజకవర్గంలోనూ ఫ్లోరైడ్ బాధిత గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. గుడిబండ మండల పరిధిలోని కెఎస్ పల్లి, హిరేతుర్పి, కరికెర తదితర గ్రామాల్లో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంది. ఈ నీటిని తాగుతున్న వారి పళ్లు రంగు మారి, ఎముకల్లో దృఢత్వం తగ్గి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుట్టిన పిల్లలకూ ఎదుగుదల లేకుండా పోయింది. ఇప్పటికే చాలా గ్రామాల్లోని వారు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.

సూచనలతో సరిపెడుతున్న అధికారులు..

తాగునీటిలో రసాయనాల శాతం ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఫ్లోరైడ్ 1.20 శాతానికి మించి ఉంటే ఆ బోరు ప్లాంటును ప్యూరిఫై చేయాలి. అప్పటికీ ఫ్లోరైడ్ శాతం తగ్గకపోతే ఆ బోరును మూసివేసి ప్రత్యామ్నాయంగా మరో బోరు ఏర్పాటు చేయాలి. కానీ అధికారులు మాత్రం కేవలం బోర్లలో నీరు వాడుకోవద్దని, ప్యూరిఫైడ్ వాటర్ తాగాలంటూ ఉచిత సలహాలిచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో గ్రామాల్లోని జనం బోర్ల నీటినే వినియోగిస్తూ రోగాల బారిన పడుతున్నారు.

మినరల్ వాటరే తాగుతున్నాం

మా గ్రామంలో 50 కుటుంబాలున్నాయి. గతంలో మేమంతా బోరు నీటినే తాగేవాళ్లం. అయితే ఆ నీరు తాగడం వల్ల కీళ్ల నొప్పులు, మోకాలి నొప్పులు ఎక్కువయ్యాయి. అధికారులు వచ్చి నీళ్లలో ఫ్లోరైడ్ ఉంది తాగకండి అని చెప్పి వెళ్లారు. ప్రస్తుతం మినరల్ వాటర్ కొనుక్కొని తాగుతున్నాం.

– రామలక్ష్మమ్మ, గాజులవారిపల్లి, గాండ్లపెంట మండలం

పచ్చ నేతల దౌర్జన్యకాండ



దళితుల భూమిలో కంచె వేయిస్తున్న టీడీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న ముత్యాలు

- సోమందేపల్లిలో దళితుల భూమి కబ్జా
- భూమి చుట్టూ ఫెన్సింగ్.. భూ యజమానులపై దాడి
- రహస్య ప్రాంతంలో తలదాచుకుంటున్న బాధితులు

పెనుకొండ: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు దౌర్జన్యాలకు అంతేలేకుండా పోతోంది. అధికారం అండతో దందాలు, దౌర్జన్యాలతో దుర్మార్గాలకు తెగబడుతున్నారు. తాజాగా సోమందేపల్లిలో ఓ దళిత కుటుంబానికి చెందిన భూములు కబ్జా చేశారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు ఆ కుటుంబంపై దాడులు చేసి వెళ్లగొట్టారు.

ఏడు దశాబ్దాల నుంచి అనుభవంలో ఉన్నా..

సోమందేపల్లికి చెందిన దళితుడు ముత్యాలు.. ముత్తాత 70 ఏళ్ల క్రితం గ్రామంలో వెట్టిగా పనిచేసేవారు. దీంతో ప్రభుత్వం ఆయనకు సోమందేపల్లి సమీపంలో మూడు ఎకరాల అసైన్డ్ భూములకు పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి తరతరాలుగా ముత్యాలు కుటుంబీకులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమి జాతీయ రహదారికి పక్కనే ఉండటం ఇప్పుడు రూ.కోట్లు పలుకుతుండటంతో టీడీపీ నేతల కన్ను దానిపై పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొందరు టీడీపీ నేతలు బాధితుడు ముత్యాలును భయభ్రాంతులకు గురిచేసి ఎకరా తమ పేర రాయించుకున్నారు. దీంతో మరికొందరు నేతలు మిగతా రెండు ఎకరాలు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు.

ఫెన్సింగ్ వేసి..దళితులను వెళ్లగొట్టి..

పెనుకొండకు చెందిన రామలింగ చౌదరి, వెంకటనారాయణచౌదరి తదితరులు ఆధ్వర్యంలో శుక్రవారం సోమందేపల్లి మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, తెలుగు యువత నాయకుడు వడ్డే సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, ఆంజనేయులుతో పాటు వందల మంది ముత్యాలు పొలం వద్దకు వచ్చారు. చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అనంతరం ముత్యాలు కుటుంబీకులపై దాడి చేసి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. మరోసారి ఇక్కడికి వస్తే చంపేస్తామని బెదిరించారు. భయంతో కుటుంబంతో కలిసి ఎక్కడికో వెళ్లిపోయిన ముత్యాలు రాత్రి మీడియా ముందుకు వచ్చి దారుణాన్ని వివరించారు.

'ఎక్సైజ్' నిర్వాకం.. నేరాలకు ఊతం

- ఇటీవల అనంతపురం టవర్‌క్లాక్ వద్ద మద్యం సేవించినట్టు ధ్రువీకరించిన ఇద్దరి వ్యక్తులకు, పోలీసులకు మధ్య మాటామాటా పెరిగింది. ఓ వ్యక్తిని మఫ్టీలో ఉన్న పోలీసు బూటు కాలితో తన్నిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది.
- వారం కిందట గుత్తిలో ఓ వ్యక్తి పీకలదాకా మద్యం తాగి చిరు వ్యాపారిని చితకబాదాడు. గాయపడిన ఆ వ్యాపారి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.
- నాలుగు రోజుల కిందట అనంతపురం శ్రీకంఠం సర్కిల్‌లో ముగ్గురు యువకులు మద్యం సేవించి కానిస్టేబుల్‌కు ఎదురుతిరిగారు. మాటామాటా పెరిగి కొట్టుకునే స్థాయికి చేరుకోగా.. కొందరు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

- పెరుగుతున్న మద్యం ఆధారిత నేరాలు
- విచ్చలవిడి విక్రయాల వల్లే ఈ తరహా కేసులు
- ఎక్సైజ్ అధికారుల నిర్లిప్తతే కారణమంటున్న పోలీసులు



అనంతపురం నగరంలో ఓ వైన్‌షాపు వద్ద ఇదీ పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొన్ని నెలలుగా రాజకీయ కక్షలు, దొంగతనాలు తదితర వాటితో పల్లెలు అట్టుడుకుతున్నాయి. దీనికితోడు ఇప్పుడు విచ్చలవిడి మద్యం, గంజాయి కేసులు ఎక్కువయ్యాయి. ఎక్కడ చూసినా బహిరంగ మద్యపానం వల్ల నేరాలు పెరిగాయి. మద్యం మత్తులో పట్టణాలు, పల్లెల్లో నేరాలు చేస్తుండడంతో తరచూ కేసులు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న మద్యం, గంజాయి సంబంధిత కేసులతో సివిల్ పోలీసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చేతులెత్తేసిన ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ అధికారులు రెండు జిల్లాల్లోనూ చేతులెత్తేశారు. స్వయానా ఎమ్మెల్యేలే పర్మిట్ రూములు తెరిచి మద్యం ఏరులై పారిస్తున్నా.. కనీసం కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడుతున్నారు. అనంతపురం జిల్లాలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, సూపరింటెండెంట్ వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. ఈ ముగ్గురూ అధికార పార్టీ నాయకుల ప్రభావానికి లోనై విచ్చలవిడి మద్యం విక్రయాలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇక ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. బార్‌లు, వైన్‌షాపుల యాజమాన్యాలతో 'సెటిల్‌మెంట్'లు చేయడమే పనిగా పెట్టుకున్నారని కొందరు బార్ యజమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలా విచ్చలవిడి మద్యం విక్రయాలు, బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేయడంలో ఎక్సైజ్ అధికారుల నిర్లిప్తత వెరసీ మద్యం ఆధారిత నేరాలు బాగా పెరిగిపోయాయి. ఈ భారం తమపై పడుతోందని సివిల్ పోలీసులు వాపోతున్నారు. 'మామూళ్లు వారికి, బాధలు మాకా' అంటూ ఓ పోలీస్ అధికారి వ్యాఖ్యానించడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో ...

మద్యం షాపులు	230
బార్‌లు	29
రోజుకు మద్యం వినియోగం విలువ	రూ.6 కోట్లు
రోజుకు సగటున డ్రంకన్ డ్రైవ్ కేసులు	500కు పైనే
మత్తులో జరిగిన గొడవలు, ఇతరత్రా కేసులు సుమారు	200

భళా.. బాల మేధావుల కళ

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- వినూత్న అంశాలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- 87 నమూనాల్లో 9 రాష్ట్రస్థాయికి ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప



రాష్ట్రస్థాయికి ఎంపికైన నమూనాతో ఉపాధ్యాయురాలు సుకన్య

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు ఊహలకు రెక్కలు తొడిగారు. తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీశారు. అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఇందుకు పుట్టపర్తి సమీపంలోని సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన వేదికైంది. తమ ఆలోచనలకు సాంకేతికను జోడించి నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తయారు చేసిన వివిధ ఎగ్జిబిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. వారం రోజులుగా పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ఉత్తమమైనవిగా ఎంపిక చేసిన 87 ఎగ్జిబిట్లను జిల్లా స్థాయిలో ప్రదర్శించారు. ఇందులో వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయుల విభాగంలో మూడేసి చొప్పున అత్యుత్తమమైన 9 ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీటిని జనవరి 2వ వారంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించనున్నారు.

రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చూపాలి..

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని డీఈఓ కృష్ణప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సంస్కృతీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఎందరో మేధావులు ఉన్నారని, వారిని ప్రపంచానికి పరిచయం చేసేందుకే ప్రభుత్వం ఏటా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు చేస్తోందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా వారు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఏడి లాజరు, డీసీఈబీ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, హెచ్‌ఎం వెంకటరమణ, ఎస్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ వెంగమనాయుడు, కౌన్సిలర్ జయప్ప, జిల్లా నలు మూలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వ్యక్తిగత విభాగంలో: అగళి మండలం ఇనగలూరు పాఠశాలకు చెందిన చంద్రగౌడ్ (ప్రథమ), చిలమత్తూరు మండలం దేమకేతపల్లి పాఠశాల విద్యార్థి నవ్యశ్రీ (ద్వితీయ), రొద్దం పాఠశాల విద్యార్థి రాంచరణ్ (తృతీయ).

గ్రూపు విభాగంలో: గోరంట్ల మండలం పులేరు ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిత, కావ్యశ్రీ (ప్రథమ), గుడిబండ పాఠశాలకు చెందిన ఐశ్వర్య, మౌనిక (ద్వితీయ), హిందూపురం పూలకుంట పాఠశాల విద్యార్థులు మహేష్‌బాబు, బాలయ్య (తృతీయ).

టీచర్స్ విభాగంలో: 'హెల్ద్ హోం హ్యాపీ హోం' ప్రదర్శనతో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు పాఠశాల ఉపాధ్యాయురాలు వసంతరాణి (ప్రథమ), ఎన్విరాన్‌మెంట్ సస్టైనబుల్ ప్రదర్శనతో పరిగి మండలం ధనాపురం ఉన్నత పాఠశాల టీచర్ సుకన్య (ద్వితీయ), ఎడిబుల్ వాటర్ బాటిల్ ప్రదర్శనతో బుక్కపట్నం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మహబూబ్ బాష (తృతీయ)విజేతలుగా నిలిచారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన మ్యాథ్స్ పార్క్ నమూనాతో దేమకేతపల్లి విద్యార్థి నవ్యశ్రీ



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రమాదాలు నివారించే నమూనాతో గుడిబండ విద్యార్థులు మౌనిక, ఐశ్వర్య

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి

కదిరి అర్బన్: మండలంలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో శుక్రవారం నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పలు రైళ్లకు స్టాపింగ్



గుంతకల్లు: ప్రయాణికుల అభ్యర్థన మేరకు గుంతకల్లు డివిజన్ పరిధిలోని కొండాపురం, కోయిలకుంట్ల, జమ్మలమడుగు రైల్వే స్టేషన్లలో పలు రైళ్ల నిలుపుదలకు అనుమతినిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మచిలీపట్నం–ధర్మవరం–మచిలీపట్నం (17215/16) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొండాపురం రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించారు. అలాగే గుంటూరు–తిరుపతి–గుంటూరు (17261/62) ఎక్స్‌ప్రెస్ రైళ్లను కోయిలకుంట్ల, జమ్మలమడుగు రైల్వేస్టేషన్లలో నిలుపుదల చేసేందుకు అనుమతులిచ్చారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ రైళ్లు ఆయా స్టేషన్లలో ఆగనున్నాయి.

నారికేళం.. ప్రియం



- ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో జనం కుదేలు
- తాజాగా టెంకాయల ధర పెరగడంతో పూజలపై ప్రభావం
- పండుగల వేళ మరింత ప్రియం కానున్న టెంకాయలు
- ధరల నియంత్రణపై దృష్టి సారించని కూటమి సర్కార్



హిందూపురం సమీపంలోని కొబ్బరి తోట

హిందూపురం అర్బన్: ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలతో జనం కుదేలయ్యారు. ఈ లోపు టెంకాయల ధరలు పెరగడంతో దేవుడి పూజలపై ప్రభావం చూపుతోంది. మరి కొన్ని రోజుల్లో పండగల సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో మార్కెట్‌లో టెంకాయల ధర అమాంతం పెరిగిపోయింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1.50 లక్షల టెంకాయ చెట్ల నుంచి అందుతున్న ఫలసాయంతో పాటు ప్రజల అవసరాల దృష్ట్యా పెద్ద సంఖ్యలో కర్ణాటక నుంచి కూడా వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు.

దిగుబడులు తగ్గి.. ధర పెరిగి..

జిల్లాల్లో ప్రధానంగా అమరాపురం, మడకశిర, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ , కళ్యాణదుర్గం ప్రాంతాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు ప్రతి ఇంట్లోనూ విశేష పూజలు పెద్ద ఎత్తున నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ప్రతి పూజకూ దేవుడికి టెంకాయ కొడుతుంటారు. ఈ మూడు రోజుల పాటు ప్రతి ఇంట్లోనూ ఎంత లేదన్నా... మూడు నుంచి ఐదు టెంకాయల వరకు దేవుడికి సమర్పిస్తుంటారు. అయితే ఇప్పటి వరకూ జిల్లాలో టెంకాయల ఫలసాయం తక్కువగానే ఉంటూ వస్తోంది. దీంతో పొరుగున ఉన్న కర్ణాటకలోని తుమకూరు, కొరటగెర, టిప్పటూరు ప్రాంతాల నుంచి టన్నుల కొద్దీ టెంకాయలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల వరుస తుపానుల ప్రభావానికి తోడు కోతుల బెడద కారణంగా పొరుగు రాష్ట్రంలోనూ టెంకాయల దిగుబడి గణనీయంగా తగ్గినట్లు సమాచారం . దీంతో తోటలకు కాపలాదారు కూలి ఖర్చు మొదలు... కోత కోసే కూలీల వరకూ కూలి చెల్లింపులు పెరిగాయి.

కిలోల లెక్కన అమ్మకం..

కర్ణాటకలోని టిప్పటూరు మార్కెట్, ఇతర చోట్ల గతంలో కాయలు లెక్కించి అమ్మకాలు చేసేవారు.



అమ్మకానికి ఉంచిన కొబ్బరికాయలు

ప్రస్తుతం ఈ విధానానికి అక్కడి దళారులు స్వస్తి పలికి కిలోల లెక్కన అమ్మకం చేపట్టారు. టెంకాయ పరిమాణాన్ని బట్టి క్వింటా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకూ అమ్ముతున్నారు. ఈ లెక్కన సైజును బట్టి క్వింటాకు 200 నుంచి 300 కాయలు వస్తాయి. వీటిని స్థానిక వ్యాపారులు లారీల్లో దిగుమతి చేసుకుని చిల్లరగా ఒక్కో కాయను రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. నిత్యావసర సరుకులతో పాటు టెంకాయల ధరల నియంత్రణపై కూటమి సర్కార్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దిగుబడి లేదు



మార్కెట్‌లో టెంకాయలు, ఎండు కొబ్బరికి చాలా డిమాండ్ ఉంది. ఇప్పుడు పండుగల సీజన్ కావడంతో టోకు వ్యాపారులు ధర మరింత పెంచారు. జిల్లాలో అందుబాటులో ఉన్న తోటల నుంచి స్థానికంగా 30 శాతం అవసరాలకు దిగుబడులు సరిపోతున్నాయి. మిగిలిన 70 శాతం కాయలను కర్ణాటక నుంచి కొనుగోలు చేస్తున్నాం.

– ఉదయ్‌కుమార్, టెంకాయల వ్యాపారి, హిందూపురం

రెట్టింపు ధర చెబుతున్నారు



గతంలో రూ.20తో టెంకాయ కొనుగోలు చేసి గుడికెళ్లి దేవుడికి సమర్పించేవాళ్లం. ఇప్పుడు అదే కాక రూ.40 అంటున్నారు. పండుగల సీజన్ వస్తోంది. దేవుడికి టెంకాయ కొట్టాలంటే సామాన్యులు ఆలోచించాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించాలి. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– కవిత, గృహిణి, చిలమత్తూరు

10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 నుంచి 70ఏళ్ల పైబడిన రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు అర్హులు. 40 ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పూర్తి వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125లో సంప్రదించవచ్చు.

దంపతులను కబళించిన అతి వేగం



రాజశేఖర్‌చౌదరి, సుమలత దంపతులు (ఫైల్)

పెద్దవడుగూరు: అతి వేగం దంపతుల ప్రాణాలను బలిగొంది. వివరాలు... కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ చౌదరి(40), సుమలత(35)దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం పట్టు చీరలు కొనుగోలు చేసేందుకు రాజశేఖర్ చౌదరి, సుమలత యాడికి గ్రామానికి వచ్చారు. పట్టుచీరలు కొనుగోలు చేసిన అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారిని పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలో 67వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే గుత్తి వైపు నుంచి యాడికికి శరవేగంగా వెళుతున్న బొలెరో (ఏపీ39 సీఎక్స్ 4984) వాహనం ఢీకొంది. ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం పాలయ్యారు. బొలెరో వాహనంలో ఉన్న యాడికి గ్రామానికి చెందిన యువకుడు సాయిమణి కంఠకూ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం (44) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో 12 ఏళ్ల క్రితం పిల్లలను పిలుచుకుని భార్య వెళ్లిపోయింది. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం తన తల్లితో పాటు అనంతపురం రూరల్ సిండికేట్‌నగర్‌కు వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. అనారోగ్యంతో బాధపడుతూ ఆరు నెలల క్రితం తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన సుబ్రహ్మణ్యం ఒంటరి జీవితాన్ని తాళలేకపోతున్నానంటూ తరచూ బంధువులు, స్నేహితులతో చెప్పుకుని బాధపడేవాడు. గురువారం రాత్రి భోజనం ముగించుకుని ఇంట్లో నిద్రించిన ఆయన శుక్రవారం తెల్లవారిన తర్వాత కూడా తలుపు తీయలేదు. అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు వెళ్లి పరిశీలించగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య



మాట్లాడుతున్న డాక్టర్ రామసుబ్బయ్య

పుట్టపర్తి అర్బన్: రబీలో సాగు చేసిన వివిధ రకాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు ఉంటాయని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం కొట్లపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రబీలో వేరుశనగ, మొక్కజొన్న, వరి పంటలతో పాటు పప్పుశనగ పంటనూ విస్తారంగా సాగు చేశారన్నారు. ముఖ్యంగా వరి నారు దశ నుంచి పిలక దశలో ఉందన్నారు. వరి నాటేటప్పుడు ఎకరాకు 200 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేయాలన్నారు. వరిలో రెండు మీటర్లకు ఓ చోట 20 సెంటీమీటర్ల వెడల్పు ఉండేలా కాలి బాటలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వేరుశనగలో రసం పీల్చే పురుగు, పొగాకు లద్దె పురుగు ఆశిస్తాయన్నారు. వీటి నివారణకు లీటరు నీటికి ఇమిడా క్లోఫిడ్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి క్వినాల్ పాస్ 2.0 ఎంఎల్, తడియో కార్బ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలన్నారు. 10 రోజుల నుంచి నెల రోజుల సాగులో ఉన్న మొక్కజొన్న పంటలో 20 నుంచి 30 రోజుల మధ్య యూరియా వాడాలన్నారు. కత్తెర పురుగు ఆశిస్తే లీటరు నీటికి ఇమామెక్టిన్ బెంజిట్ 0.3 గ్రాములు లేదా రీనాక్సాపీర్ 0.3 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పప్పుశనగ పంట ప్రస్తుతం కాయ దశలో ఉందన్నారు. దీనికి ఎండ తెగులు, తుప్పు తెగులు ఆశించకుండా లీటరు నీటికి ఎక్సోకొనజోల్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై నేడు విచారణ

- చిలమత్తూరు పంచాయితీలో భారీగా నిధుల స్వాహా
- పంచుకుని తిన్న టీడీపీ నేతలు
- నిధుల డ్రా కోసం సర్పంచ్ సెల్‌నంబర్ మార్చిన వైనం

సాక్షి టాస్క్ ఫోర్స్: ఆరు నెలలుగా చిలమత్తూరు పంచాయతీ నిధులను అడ్డగోలుగా దోచేసిన వారి మెడకు ఉచ్చు బిగుసుకుంటోంది. చేయని పనులకు బిల్లులు పెట్టి రూ.లక్షలు జేబుల్లో వేసుకున్న నేత వెన్నులో వణుకు మొదలైంది. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన రామ్లానాయక్‌పై ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలోనే శనివారం డివిజనల్ పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో విచారణ జరగనుంది. అయితే సదరు కార్యదర్శి తాను టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గే రూ.లక్షలు బిల్లులు చేసినట్లు ఇప్పటికే అధికారులకు తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విచారణ పారదర్శకంగా జరిగితే నిధులు బొక్కిన టీడీపీ నేతలు ఇరుక్కునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

చేయని పనులకూ బిల్లులు..

తుమ్మలకుంట వద్ద బోరుబావి కోసం టీడీపీ నేత నందీశప్ప పేరిట ఏకంగా రూ.6.60 లక్షలు, వాటర్ వర్క్స్ మెయింటెనెన్స్ పేరుతో రూ. 3.53 లక్షలను స్వాహారాయుళ్లు మింగేశారు. ఫేక్ బిల్లులు సృష్టించుకుని మరీ నిధులు కాజేశారు. వాటర్ వర్క్స్ కోసమని గౌస్ లాజెమ్ అనే పంచాయతీ కార్మికుడి పేరుతో రూ.3 లక్షలకుపైగా స్వాహా చేశారు. ఆలయాల సుందరీకరణ పేరుతోనూ భారీగా నిధులను కాజేస్తున్నారు. ఇలా గత ఆరు నెలల కాలంలో చిలమత్తూరు పంచాయితీలో సుమారు రూ. 60 లక్షలకుపైగా నిధుల గోల్‌మాల్ జరిగినట్టుగా తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఒకరు టీడీపీ నేతలతో కుమ్మక్కై పాత బోరుబావులను కొత్తవిగా సృష్టించి మరీ రూ.లక్షలు దోచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారం స్థానిక సర్పంచ్‌కు కూడా తెలియకుండా సాగినట్లు తెలుస్తోంది. ఇందుకోసం స్వాహా రాయుళ్లు బిల్లులకు సంబంధించిన ఓటీపీ సర్పంచ్ సెల్‌ఫోన్‌కు రాకుండా ఆన్‌లైన్‌లో సర్పంచ్ నంబర్ పేరుతో మరో నంబర్ అప్‌డేట్ చేయించినట్లు తెలుస్తోంది.



ప్రధాన రహదారికి అడ్డంగా విరిగిపడిన విద్యుత్ స్తంభం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ధర్మవరం అర్బన్: స్థానిక గాంధీనగర్ సర్కిల్ సమీపంలో శుక్రవారం విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా పడింది. డివైడర్ల మధ్యలో ఉండే బటర్‌ఫ్లై లైట్లు రెండు స్తంభాలు విరిగి వంగిపోయాయి. ప్రధాన రహదారిలో విద్యుత్ లైన్లు పడ్డాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం పడడంతో దాదాపు గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించింది. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి స్తంభాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. డివైడర్ల మధ్యలో వంగిపోయిన బటర్‌ఫ్లై విద్యుత్ స్తంభాలకు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేశారు.

పామిడిలో రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

పామిడి: స్థానిక కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటిమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం సందర్భంగా ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పూజారి నాగన్న శుక్రవారం తెలిపారు. 21న ఆరు పళ్ల విభాగం, 22న న్యూ కేటగిరి వృషభాలకు రాతి దూలం లాగుడు పోటీలు ఉంటాయి. వివరాలకు 96425 78133, 96186 02061, 73306 51416లో సంప్రదించవచ్చు.

పోలీస్‌స్టేషన్‌లోనే నీచ కృత్యం



ఓ మహిళతో అనుచితంగా ప్రవర్తిస్తున్న డీఎస్పీ రామచంద్రప్ప

పావగడ: సాక్షాత్తూ హోం మంత్రి సొంత జిల్లాలోనే మహిళకు భద్రత కరువైంది. తన సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన మహిళపై డీఎస్పీ అసభ్యకరంగా ప్రవర్తించాడు. వివరాలు... పావగడ నుంచి పొలం వ్యాజ్యానికి సంబంధించి ఫిర్యాదు ఇచ్చేందుకు గురువారం ఓ మహిళ మధుగిరి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లింది. అక్కడే ఉన్న డీఎస్పీ రామచంద్రప్ప సదరు మహిళను తన కార్యాలయంలోని మరుగుదొడ్డిలోకి పిలుచుకెళ్లి అసభ్యకరంగా తాకుతూ వేధించాడు. కొందరు కిటికీ గుండా వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. వీడియో వైరల్ కావడంతో డీఎస్పీ రామచంద్రప్ప తప్పించుకుని పరారయ్యారు. హోం మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ సొంత జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన పై ఆ జిల్లా ఎస్పీ కేవీ అశోక్ స్పందిస్తూ పోలీసు శాఖ గౌరవాన్ని భంగపరిచే నీచకృత్యమన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. తాను కూడా ఆ వీడియోను చూశానన్నారు. ఈ విషయంపై దర్యాప్తు జరిపేందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శాఖలో మహిళలపై దౌర్జన్యాన్ని సహించబోనన్నారు. కాగా, పరారీలో ఉన్న డీఎస్పీ రామచంద్రప్పను మధుగిరి పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేశారు.

'అధికారిక' దౌర్జన్యం

- షాడో ఎమ్మెల్యే భరోసాతో దౌర్జన్యంగా పంట తొలగింపు
- కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి అక్రమంగా రహదారి నిర్మాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటైన తర్వాత ఎమ్మెల్యేల అండతో అధికారిక దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. రోజూ ఎక్కడో ఓ చోట టీడీపీ నేతల ఆగడాలకు సామాన్య ప్రజలు బలవుతూనే ఉన్నారు. తాజాగా సొంత పట్టా భూమిలో సాగు చేసిన పంటను తొలగించి అక్రమంగా రహదారిని ఏర్పాటు చేసిన ఘటన అమడగూరు మండలం హరిపురంలో వెలుగు చూసింది. బాధిత రైతు కిష్టప్ప, ఆయన కుమార్తె గిరిజమ్మ, అల్లుడు సూర్యనారాయణ తెలిపిన మేరకు...

ఏళ్ల క్రితమే కొనుగోలు చేసిన భూమి..

అమడగూరు మండలం కొక్కంటిపల్లికి చెందిన కిష్టప్పకు హరిపురం వద్ద సర్వే నంబర్ 250, 252–1లో 3.99 ఎకరాల సొంత భూమి ఉంది. కొన్నేళ్ల క్రితమే ఇతరుల నుంచి కొనుగోలు చేసిన ఈ పొలంలో వివిధ రకాల పంటల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వంకాయ, వేరుశనగ పంటలు సాగు చేశారు. ఈ క్రమంలో కొన్నాళ్లుగా హరిపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు తమ జీవాల మేపు కోసం కదిరి, కొక్కంటిక్రాస్‌కు వెళ్లడానికి కిష్టప్పకు చెందిన భూమి మీదుగా దారి చూపించాలని అధికారులకు విన్నవిస్తూ వచ్చారు. అయితే కిష్టప్ప భూమికి పక్కా ఆధారాలు, పట్టా ఉండడంతో సాధ్యం కాదని అధికారులు చెబుతూ వచ్చారు.

షాడో ఎమ్మెల్యే ప్రమేయంతో...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గొర్రెల కాపరులు స్థానిక పంచాయతీ టీడీపీ నేతలతో కలసి చర్చించారు. అనంతరం వారితో కలసి నేరుగా ఎమ్మెల్యేగా అన్నీ తానై నడిపిస్తున్న వ్యక్తి వద్దకెళ్లి లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. అనారోగ్యంతో బాధపడుతూ కదిరిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిష్టప్ప స్వగ్రామానికి చేరుకోక ముందే దారి ఏర్పాటు చేస్తే తమను అడ్డుకునేవారు ఎవరూ ఉండరని భావించారు. దీంతో షాడో ఎమ్మెల్యే ఇచ్చిన భరోసా.. స్థానిక టీడీపీ నాయకుల అండ చూసుకుని గురువారం దౌర్జన్యంగా కిష్టప్ప పొలంలో దారి ఏర్పాటు చేసేందుకు కాపరులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో జేసీబీని పొలం వద్దకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కిష్టప్ప కుటుంబసభ్యులు అడ్డుకోవడంతో వివాదం ముదిరి జేసీబీతో పాటు కాపరులు వెనక్కు తగ్గారు.

లాగి పడేసి..

గురువారం తమకు ఎదురైన చేదు అనుభవాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు మరింత కక్షతో రగిలిపోయారు. దీంతో శుక్రవారం ఉదయమే మళ్లీ గొర్రెల కాపరులను రెచ్చగొట్టి జేసీబీ వాహనంతో కిష్టప్ప పొలానికి పంపి సాగు చేసిన వంకాయ, వేరుశనగ పంటలను తొలగించి అక్రమంగా దారిని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతు కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి అడ్డుపడినా పక్కకు లాగి పడేశారు. తమ కంటి ముందే పంటను తొలగిస్తుంటే మౌనంగా రోదించడం తప్ప మరేమీ చేయలేని అసహాయ స్థితిలో నిరుపేద రైతు కుటుంబం విలవిల్లాడింది. 'ఇంత కంటే అన్యాయం ఎక్కడైనా ఉందా? డబ్బు పెట్టి కొన్న భూమికి ఆధారాలన్నీ సక్రమంగా ఉన్నాయి. అయినా అన్యాయంగా పంటను తొలగించి దారిని వేసుకుంటే మేము ఏమైపోవాలి' అంటూ బోరు విలపించారు.



వేరుశనగ పంటను తొలగించి అక్రమంగా ఏర్పాటు చేసిన దారిని చూపుతున్న రైతు గిరిజమ్మ

కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ..

కాగా, టీడీపీ నేతల కుట్రలతో విసుగు చెందిన కిష్టప్ప నెల రోజుల క్రితం న్యాయస్థానాన్ని ఆశ్రయించి భూమికి సంబంధించి శాశ్వత ఇంజెక్షన్ ఉత్తర్వులు పొందారు. గొడవ పడతారని తెలుసుకుని ముందుగానే స్థానిక పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అయినా టీడీపీ నేతల కుట్రలతో మానసికంగా కుదేలైన కిష్టప్ప అనారోగ్యం బారిన పడి కదిరిలోని ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నేతలు... షాడో ఎమ్మెల్యే భరోసాతో గొర్రెల కాపరులను రెచ్చగొట్టి కిష్టప్ప సాగు చేసిన పంటను దౌర్జన్యంగా తొలగించడంతో పలువురు రైతులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. టీడీపీ నేతల అధికారిక దౌర్జన్యానికి ఉన్న 3.99 ఎకరాల పొలంలో ఎకరా విస్తీర్ణాన్ని కోల్పోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన అనంతరం కిష్టప్ప కుమార్తె గిరిజమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.